విలక్షణ రాజకీయ విజేత

విలక్షణ రాజకీయాలకు, ఉద్ధండులైన నేతలకు నెలవైన కావలి నియోజకవర్గంలో వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా అనూహ్యమైన విజయాలను సొంతం చేసుకున్న విలక్షణ రాజకీయ విజేతగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నిలుస్తారు. కావలి అసెంబ్లీ చరిత్రలో వరుసగా మూడు సార్లు గెలిచిన చరిత్ర ఇప్పటి వరకు దివంగత మాజీమంత్రి కలికి యానాదిరెడ్డికి మాత్రమే ఉంది. ఆ చరిత్రను ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఒక్కరే సమం చేయనున్నారు. తాజాగా జరగబోయే ఎన్నికల్లో ఆ హ్యాట్రిక్‌ను సొంతం చేసుకోనున్నారు.

వరుసగా రెండు సార్లు విజయం

- హ్యాట్రిక్ కోసం తహతహలాడుతున్న వైనం
- అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించిన ఎమ్మెల్యే


జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వ్యూ

కావలి: రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి రాజకీయ క్షేత్రంలో ప్రజల మనస్సు గెలిచిన నేతగా నిలిచారు. కుట్ర రాజకీయాలు, కుతంత్ర ప్రచారాలతో ప్రజాభిమానంతో రెండో సారి గెలవడం అసాధ్యమైన ఈ రోజుల్లో ప్రత్యర్థులు ఏకమైనా ఒంటరి పోరాటంతో అత్యధిక మెజార్టీతో గెలిచిన రాజకీయ ధీరుడు. ప్రజల్లో ఆత్మీయుడిగా, సౌమ్యుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాస్ లీడర్‌గా ఎదిగారు. శషభిషలకు తావు లేకుండా తాజాగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి ఆ పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు బాణ సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

కన్‌స్ట్రక్షన్ రంగం నుంచి రాజకీయ రంగంలోకి..

కావలి పట్టణంలోని పాతూరులో సాధారణ రైతు రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి, శివరావమ్మ దంపతులకు 4 జూన్ 1964 రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి జన్మించారు. కావలిలోని విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాల, జవహర్ భారతి కళాశాల, చెన్నైలో సివిల్ ఇంజినీరింగ్ విద్యాభ్యాసం చేశారు. సతీమణి ఆదిలక్ష్మి, కొడుకు బాలసాకేత్ రెడ్డి, కుమార్తె సంహిత. సివిల్ ఇంజినీర్ అయిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి బెంగళూరులో కన్‌స్ట్రక్షన్ రంగంలో దిగి అంచెలంచెలుగా ఆర్థికంగా ఎదిగారు. 2006లో మాజీ మంత్రి కలికి యానాదిరెడ్డి దివంగతులు కావడం, స్థానికేతరులు కావలిలో పోటీ చేస్తున్న పరిస్థితుల్లో ఏర్పడిన రాజకీయ శూన్యతను తొలగించడానికి ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని రాజకీయాల్లో రావాలని కావలిలోని తన సన్నిహితులు, కుటుంబ సభ్యులు కోరారు. ప్రధాన పార్టీల్లో అభ్యర్థిత్వాల పోటీ ఎక్కువగా ఉండడంతో 2009లో కొత్తగా ఆవిర్భవించిన ప్రజారాజ్యం పార్టీ తరఫున కావలి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేశారు. వైఎస్సార్ పొలిటికల్ సునామీలో తొలిసారిగా పోటీలో చేసిన ప్రతాప్‌కుమార్‌రెడ్డికి డిపాజిట్ కూడా దక్కలేదు. అదే ఏడాది వైఎస్సార్ మరణించడంతో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారాయి. 2011లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ స్థాపించడం, పార్టీకి ప్రజాదరణ ఉండడంతో ఆయన పార్టీలో చేరారు. అదే ఏడాది జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నెల్లూరు జిల్లా అభ్యర్థిగా ప్రతాప్‌కుమార్ రెడ్డి కేవలం 7 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా జిల్లాలో గుర్తింపు తెచ్చుకున్నారు. కావలి వైఎస్సార్‌సీపీలో అప్పటికే కీలకంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు తదనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో మరో మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. అయితే సీనియర్లను కాదని 2014 ఎన్నికల్లో కావలి అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ప్రతాప్‌కుమార్‌రెడ్డి టికెట్ దక్కించుకున్నారు. ఆ ఎన్నికల్లో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు సహకారం అందించినప్పటికీ కేవలం 4,969 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మరోసారి పోటీ చేసిన ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ప్రత్యర్థిగా పోటీ చేసిన కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిపై 14,117 ఓట్ల ఆధిక్యంతో విజయకేతనం ఎగుర వేశారు. చిన్న వారైనా.. పెద్ద వారైనా అందరితో కలిసిపోయే నేత ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాస్ అండ్ క్లాస్ లీడర్‌గా ఎదిగారు.


ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే

వరుసగా మూడు సార్లు గెలిచిన చరిత్ర కలికిదే..

1972 నుంచి కావలి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. 11 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే ఇందులో నాలుగు సార్లు కలికి యానాది రెడ్డి గెలిచారు. అయితే 1978లో తొలిసారి గెలిచిన యానాదిరెడ్డి 1983లో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 1985, 1989, 1994 ఎన్నికల్లో వరుసగా మూడు గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యే చరిత్ర సృష్టించారు. ఆయనకు ముందు, తర్వాత రెండు సార్లు వరుసగా గెలిచిన చరిత్ర ఏ నేతకు లేదు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి రెండు సార్లు గెలిచి ఆ చరిత్రను సొంతం చేసుకున్నారు. తాజాగా జరగబోయే ఎన్నికల్లో మరోసారి హ్యాట్రిక్ విజయం సాధించి కలికి చరిత్రను సమం చేస్తారని రాజకీయ పండితులు చెబుతున్నారు.



అభివృద్ధిలో ప్రతాప్‌కుమార్‌రెడ్డి మార్క్

ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి రెండు సార్లు గెలిచినప్పటికీ అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఐదేళ్లలో కావలి నియోజకవర్గ రూపురేఖలు మార్చే అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కావలి అభివృద్ధిలో తనదైన మార్క్‌ను వేసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పూర్తి చేయించారు. రామాయపట్నం పోర్టు మొదటి ఫేజ్ సిద్ధమైంది. రాబోయే ఏడాదిలో పోర్టుకు అనుబంధంగా 2 వేల ఎకరాల్లో పరిశ్రమలు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దామవరంలో విమానాశ్రయం, పట్టణానికి అవుటర్ రింగ్ రోడ్డు, ట్రంక్‌రోడ్డు విస్తరణ, కావలి పెద్ద చెరువు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడం వంటి పనులు పురోగతిలో ఉన్నాయి.

సేవ కార్యక్రమాలు విస్తృతం

బెంగళూరులో కన్‌స్ట్రక్షన్ రంగం, వ్యాపారాలు ఉండడంతో అక్కడే లయన్స్ క్లబ్‌లో చేరి సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేశారు. రెడ్‌క్రాస్ కూడా ప్రతాప్‌కుమార్‌రెడ్డి సేవా కార్యక్రమాలను గుర్తించింది. ఇంజినీరింగ్ చదువుకోవడానికి చెన్నై వెళ్లాల్సిన తనలాంటి దుస్థితి కావలి ప్రాంత విద్యార్థులకు ఉండడంతో విద్య సంస్థలు నెలకొల్పాలని భావించారు. కావలి సమీపంలోని కడనూతల వద్ద ఆర్‌ఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేశారు. కావలి మండలం ముసునూరు సమీపంలో ఆర్‌ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను స్థాపించారు. రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి గత 14 సంవత్సరాలుగా కావలి మండలంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి


ఉదయగిరిలో కవాతు నిర్వహిస్తున్న బీఎస్‌ఎఫ్ జవాన్లు

ఉదయగిరి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని సీఐ వి.గిరిబాబు, ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి కోరారు. ఆదివారం ఉదయగిరితో పాటు మండలంలోని జి.చెరువుపల్లి, జి.చెర్లోపల్లి, సంజీవరాజుపల్లి, అయ్యవారిపల్లి, బిజ్జంపల్లి, పుల్లాయపల్లి, శకునాలపల్లి గ్రామాల్లో బీఎస్‌ఎఫ్ జవాన్లతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. వివాదాలకు పాల్పడినా, ఘర్షణలకు దిగినా, అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు శ్రీనివాసులు, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృత ప్రచారం


బోగోలు పంచాయతీ బేతనీయపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బిట్రగుంట: బోగోలు పంచాయతీ బేతనీయపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని, ఎంపీగా విజయసాయి రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పేదల పక్షాన నిలబడి సంక్షేమ పథకాల ద్వారా భరోసా కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మంద కౌసల్య, వార్డు సభ్యులు గంగపట్ల చిన్నమ్మ, నాయకులు పత్రి అంకులయ్య, గోపిశెట్టి వెంకయ్య, కందల వీరాస్వామి, పులివెందుల శంకర్రావు, బంకా కమలాకర్, బంకా రాజన్న, వినయ్, పాపయ్య, సాగర్, రాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార పక్షోత్సవం

కావలి: పట్టణంలోని ఇస్లాంపేట, గాయత్రినగర్, జొన్నాయగుంట అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఆ ప్రాంతాల్లో ఉన్న గర్భిణులు, బాలింతలు, తల్లులకు మంచి పోషకాహారం తీసుకోవాలి, రక్తహీనతకు లోనుకాకుండా పోషణకు విలువలు కలిగిన ఆహారం తీసుకుంటూ ఉండాలని సమగ్ర శిశు అభివృద్ధి అధికారిణి కె.సౌజన్య, సూపర్‌వైజర్ సుహాసిని సూచించారు. పిల్లలు పుట్టిన వెంటనే ముర్రుపాలు తప్పనిసరిగా తాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు మంజుల అరుణ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి 70 కుటుంబాలు గుడ్‌బై

బిట్రగుంట: అల్లూరు మండలానికి చెందిన 70 టీడీపీ సానుభూతి పరుల కుటుంబాలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి స్వతంత్ర్య అభ్యర్థి పసుపులేటి సుధాకర్‌కు ఆదివారం మద్దతు ప్రకటించారు. చెంచులక్ష్మీపురంలోని పసుపులేటి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్లూరుపేటతో పాటు గ్రద్దగుంట, బట్రకాగొల్లు, పల్లిపాడు, నార్త్ ఆమలూరు, తదితర ప్రాంతాలకు చెందిన వీరు టీడీపీని వీడి సుధాకర్ వర్గంలో చేరుతున్నట్లు ప్రకటించారు. పార్టీలో చేరిన వారిని కండువాలు కప్పి సుధాకర్ ఆహ్వానించారు.

విద్యార్థులకు సమయపాలన అవసరం

కోవూరు : విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకమని, పరీక్షల సమయంలో టైమ్ సెన్స్ అవసరమని హెచ్‌ఎం నరసింహమూర్తి తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ బీసీ వసతి గృహాల్లో ఉంటున్న 75 మంది పదో తరగతి విద్యార్థులకు ప్రభావతి చారిటబుల్ ట్రస్టు ద్వారా పరీక్షల మెటీరియల్స్‌తో పాటు వాచ్‌లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగాలని తెలిపారు. ట్రస్టు నిర్వాహకులు నాగార్జున, సత్యవతి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఎంఈఓ రహీమ్ మాట్లాడుతూ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు నూరుశాతం ఫలితాల సాధనే ధ్యేయంగా చదవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం ఎనలేనిదన్నారు.


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిక


పార్టీలో చేరిన వారితో ఉదయగిరి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు: మండలంలోని విరువూరు పంచాయతీకి చెందిన కోటవర్దినిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరులు 20 కుటుంబాలు ఆదివారం రాత్రి దుత్తలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు మందలపు తిరుపతినాయుడు, మాగంటి శ్రీనివాసులు, మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వీరు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ 40 ఏళ్లుగా మేకపాటి కుటుంబ సభ్యులు ప్రజలకు చేస్తున్నటువంటి అభివృద్ధి, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలకు ఆకర్షితులై తాము పార్టీలో చేరామన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు తమవంతు కృషి చేస్తామన్నారు. మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. చింతలపూడి రత్తయ్య, తెలజాల పెదమాలకొండయ్య, పుల్లయ్య, బంకా సింహాద్రి, మల్లెలబోయిన శ్రీను, వెంకటేశ్వర్లు, ఎస్.నాగేశ్వరరావు తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు


అలివేలు మంగాపురం వద్ద ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి ముసుగువేసిన అధికారులు


గౌరవరంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి ముసుగేసిన దృశ్యం

వరికుంటపాడు: సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదలతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు అధికారులు ఆదివారం ముసుగులు వేశారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలు తొలగించారు.

సోమశిల: ఎన్నికల కోడ్ ప్రకటించిన నేపథ్యంలో మండలంలో రాజకీయ పార్టీ నాయకుల ఫ్లెక్సీలు, బోర్డులు, హోర్డింగ్‌లు తొలగించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఆదివారం ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు మండలంలోని అన్ని విగ్రహాలకు ముసుగులు వేయించారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన అన్నింటిని తొలగించాలన్నారు.

కోడ్ కచ్చితంగా అమలు చేస్తాం

చేజర్ల: మండలంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేస్తామని ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా అన్నారు. ఆదివారం మండలంలో గ్రామాల్లో రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించారు. రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. గ్రామాల్లో తన సిబ్బందితో కలిసి పర్యటించారు.

నేడు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి విజయాభవ యాత్ర

చేజర్ల: మండలంలోని సాదేరు, బీవీకండ్రిక, సీవీకండ్రిక, చిత్తలూరు గ్రామాల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సోమవారం సాయంత్రం విజయాభవయాత్ర నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నేడు విజయ సంకల్ప యాత్ర

జలదంకి: మండలంలోని కృష్ణాపాడు, సోమవరప్పాడు పంచాయతీల్లో సోమవారం ఉదయం 9 నుంచి ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయ సంకల్ప యాత్ర నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కొండబిట్రగుంట తిరునాళ్లకు 30 ప్రత్యేక బస్సులు


మాట్లాడుతున్న డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు

కావలి: బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు 30 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో కీలక ఘట్టాలైన తెప్పోత్సవం, గరుడసేవ, కల్యాణోత్సవాలు శుక్ర, శని, ఆదివారాల్లో రావడంతో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు. దీంతో గతేడాది 24 ప్రత్యేక బస్సులు నడపగా ఈ దఫా అదనంగా మరో ఆరు బస్సులు ఏర్పాటు చేసి మొత్తం 30 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వివరించారు. ఈ నెల 22, 23, 24వ తేదీల్లో ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయన్నారు. కావలి, అల్లూరు, నెల్లూరు, ఇస్కపల్లి, శంభునిపాళెం తదితర గ్రామాల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని వివరించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంకర కృష్ణారెడ్డి.. నోరు అదుపులో పెట్టుకో

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శివాజీ


మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శివాజీ

కావలి: టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అలియాస్ కంకర కృష్ణారెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శివాజీ మండి పడ్డారు. ఆదివారం ఆయన కావలిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమ మైనింగ్‌తో క్వారీ కృష్ణారెడ్డిగా, మైనింగ్ మాఫియాగా మారిన కావ్య కృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఏకవచనంతో సంబోధిస్తూ నోటికివచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. పేదలకు, ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉండే ప్రతాప్‌కుమార్ రెడ్డిని విమర్శిస్తే కావలి నుంచి తరిమికొడుతామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ భూములు ఆక్రమించుకుని వారి జీవితాలు నాశనం చేసిన కావ్య కృష్ణారెడ్డి అహంకార పూరిత మాటలు మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవనే భయంతో మతిభ్రమించి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. కావ్య కృష్ణారెడ్డి అక్రమాలను త్వరలోనే బయట పెడుతామని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు పక్కా ఇళ్లు, ప్రభుత్వ పథకాలు, కాలనీలకు వసతులు, ఎస్సీ, ఎస్టీల పిల్లలకు మంచి చదువులు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డిని, ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత కావ్య కృష్ణారెడ్డికి లేదన్నారు. రాబోయే రోజుల్లో కావ్య కృష్ణారెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పనున్నారని స్పష్టం చేశారు. ఆయన వెంట బాలకృష్ణ ఫ్యాన్స్ కావలి డివిజన్ అధ్యక్షుడు అన్నపూర్ణ శ్రీను, రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ద్రోణాదుల వెంకట్రావు ఉన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం


అనంతసాగరంలోని హైస్కూల్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

సోమశిల: సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంఈఓ-1 ఎం.బాలకృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని సోమశిల, అనంతసాగరం, రేవూరు ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు. మొత్తం 10 ప్రభుత్వ పాఠశాలల్లో 287 మంది, 3 ప్రైవేట్ పాఠశాలల్లో 80 మంది మొత్తం 367 మంది విద్యార్థులు ఉన్నారని, వీరితో పాటు సప్లిమెంటరీకి 72 మంది హాజరవుతున్నారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు 8.45 గంటలకు పరీక్ష కేంద్రాల వద్దకు రావాలని తెలిపారు. విద్యార్థులకు మంచినీళ్లు, మౌలిక వసతులు, వైద్యం ఏర్పాట్లు చేశామని తెలిపారు.

నేటి నుంచి పది పరీక్షలు ప్రారంభం

ఆత్మకూరు: ఆత్మకూరు, మున్సిపల్ పరిధిలోని పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు సోమవారం నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ఎంఈఓ- 2 చలపతి ఆదివారం తెలిపారు. మండలంలో మొత్తం 750 మంది విద్యార్థులకు ఆత్మకూరులోని ఐదు పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్‌మేరీస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, శ్రీనివాస ఇంగ్లిస్ మీడియం పాఠశాల, తదితర ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ వివరించారు. ఆయా పాఠశాలల్లో పరీక్షల చీఫ్, సూపరింటెండెంట్‌లుగా అనంతలక్ష్మి, వెంకటేశ్వర్లు, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరరెడ్డి, పీపీ రమణయ్య వ్యవహరించనున్నట్లు ఆయన తెలిపారు.

వరికుంటపాడు: మండలంలో సోమవారం నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు కల్పించినట్లు ఎంఈఓ షావుద్దీన్ ఆదివారం విలేకరులకు తెలిపారు. మండలంలో పది పరీక్షలకు మొత్తం 8 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల, గండిపాళెం, గురుకులం కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జలదంకి: జలదంకిలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పది పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు పరీక్షల చీఫ్ అధికారులు తెలిపారు. జలదంకిలో పది పరీక్షలకు రెండు సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. జలదంకి ఉన్నత పాఠశాలలో ఒక సెంటరు కాగా ఇక్కడ 189 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పరీక్షల చీఫ్ అధికారిణి మాధవి తెలిపారు. సాయి జూనియర్ కళాశాల సెంటరులో 249 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పరీక్షల చీఫ్ అధికారి చాగంటి మురళి తెలిపారు.


జల్‌జీవన్‌తో తాగునీరు

- చేజర్ల, మడపల్లి గ్రామాల్లో తీరనున్న దాహార్తి


బోర్‌ను బిగిస్తున్న దృశ్యం (ఫైల్)

చేజర్ల: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న దాహార్తి సమస్యకు త్వరలోనే పరిష్కారం లభించనుంది. మండలంలోని చేజర్ల, మడపల్లి గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగునీరు అందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మిస్తున్న జల్‌జీవన్ మెషిన్ పథకం కింద పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పెన్నానదిలో బోర్లు వేశారు. పైప్‌లైన్ ఏర్పాటు పనులు చేపడుతున్నారు. ఈ పథకం కింద చేజర్లకు రూ.88.60 లక్షలు, మడపల్లికి రూ.56.90 లక్షల నిధులు మంజూరయ్యాయి. పెన్నానదిలో బోర్ల నుంచి మడపల్లి వరకు పైప్‌లైన్ వేసి మడపల్లిలో సంప్ (వాటర్ ట్యాంక్) ఏర్పాటు చేసి అక్కడ వాటర్ ట్యాంక్‌కు కనెక్ట్ చేస్తారు. చేజర్లలో మరొక సంప్ ఏర్పాటు చేసి కొత్తగా వాటర్ ట్యాంక్ నిర్మించి కనెక్ట్ చేయనున్నారు. మే నాటికి పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ నిర్మాణం పూర్తయి ప్రతి ఇంటికి సురక్షితమైన తాగు నీరు అందుతుంది.

పనులు జరుగుతున్నాయి



జల్‌జీవన్ పథకం ద్వారా చేజర్ల, మడపల్లి గ్రామాలకు తాగు నీరందించే పైప్‌లైన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. కొన్ని రోజుల్లో పూర్తవుతున్నాయి. ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తి చేసి గ్రామాలకు వీలైనంత త్వరగా అందిస్తాం.

– కృష్ణ, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

మా కోరిక తీరనుంది



చేజర్ల, మడపల్లిలకు సురక్షితమైన తాగునీరు రానున్న రోజుల్లో లభిస్తుండడంతో ఆనందంగా ఉంది. చెంతనే పెన్నానది ఉన్నప్పటికీ మంచినీటి కోసం ఎన్నో సంవత్సరాలుగా తపనపడుతున్నాం. ఇన్నేళ్ల తర్వాత పల్లె వాసుల దాహార్తి తీరనుంది.

– మద్దాల వెంకటమ్మ సర్పంచ్ మడపల్లి